
# వేరుపట్ల మెరుగు



వాకాటి పాండురంగారావు

■ "అదండీ సంగతి!" అన్నాడు జాయింట్ సెక్రటరీ.

"ఏమి సంగతోనయ్యా..... రేప్పొద్దున్న ఏ పార్లమెంటుమెంబరో, పబ్లిక్ అకవుంట్స్ కమిటీ మెంబరో పట్టుకుని ఝూడించి పారేస్తాడు. ఏవిటీ దుబారా ఖర్చు — అంటూ........ 16 లక్షలని అంచనా వేసి మొదలెట్టిన ఈ భవన నిర్మాణం అంతా ముగిసేసరికి 42 లక్షల యిందనడం కాస్త ఎబ్బెట్టుగానే వుందిస్మీ—"అన్నాడు సెక్రటరీ.

"అయ్యా! మీరు దీని గురించి హేమీ విచారపడకండి. అదేదో నాగార్జునసాగరని ఆంధ్రాలో కడుతున్నారే దాని సంగతి చూడండి. ఏ 79 కోట్లో అవుతుందని మొదలెట్టారా, తీరాచేస్తే సగంపని కూడా పూర్తికాలేదు. కాని ఖర్చు మాత్రం వందరెట్లు అయిపోయింది. దానితో పోలిస్తే మన భవనం ఎంతో మేలు కాదుటండీ—" అన్నాడు జాయింట్ సెక్రటరీ.

"అవుననుకో—!" అని నస్సుగ్గుతున్న సెక్రటరీకి మరికాస్త ధైర్యం నూరిపోయసాగాడు జాసెక్.

"ధరల పెరుగుదల— డివాల్యుయేషను—పనివాళ్ళసమ్మె—ఇట్లా ఎన్ని బలాతిబలమైన కారణాలు లేవండీ ఈ ఖర్చు పెరగడానికి...... కనుక మీరేమీ ఇదవకండి..... అట్లాంటి 'క్వైరీ' అంటూ వస్తే డబుల్‌స్ట్రాంగ్ నోట్ ప్రిపేర్ చేయించిస్తానుగా..."

జాసెక్ తెలివితేటలు చూసి కాస్సేపు సంతోషపడి ఆతర్వాత భయపడనారంభించాడు సెక్.

"వీటన్నిటికన్న ముఖ్యమైన కారణం వోటుందండోయ్...." అని జాసెక్, కుర్చీలోంచి లేచివెళ్ళి గది తలుపు గడియ గట్టిగా వేసివచ్చి, కూర్చుని రహస్యంగా చెప్పాడు. "ఈ భవనం తాలూకు కంట్రాక్టు ఎవరిదనుకున్నారూ...... మన మంత్రిగారి అల్లుడిదండీ బాబూ! సాక్షాత్తూ శ్రీవారి జామాతది! ఇహ మనకు బెంగెందుకు చెప్పండి. ఇంతటి తురుఫాసు మనచేతవుంది కనుకనే పనో్లపని మీ ఇంటి ఫస్ట్ ఫ్లోర్ కానిచ్చెయ్యండీ— అని నేను మనవి జేశా!... మరి మీరేమో విసరైతిరీ....."

అయ్యబాబోయ్, ఈ జాసెక్‌గాడు దేవాంతకుడు. —వీడు ఇక్కడే గనుక మరి కొన్రోజులుంటే నాకే ఎసురు పెట్టేయగలడు..... వీడినింకో శాఖకు వేయించేయడం చాల అవసరం — మోస్ట్ ఇమ్మీడియట్— అని లోలోపల తీర్మానించుకున్న సెక్, బయటికి మాత్రం తలవూపి, చిరునవ్వు నవ్వి, ఫైలు మీద సంతకం పెట్టేశాడు.

—అక్కడితో, పదకొండేళ్ళ క్రిందనుండి, అనగా 'కిరణ్ భవన్' నిర్మాణ ప్రతిపాదన మొదలయినప్పటినుండి సదరు ఏడంతస్తుల భవనం పూర్తయి, దానిలోకి కుళాయిలు, దీపాలు వచ్చేదాక—జరుగుతూ, పెరుగుతూ వచ్చిన ఇరవైయారు వాల్యూముల ఫైలు—ముగిసింది.

తర్వాతి దశ ప్రారంభమయింది.

ఏమిటా దశ?

ఉత్సవాల దశ!

ప్రభుత్వ భవనం దేనికయినా ఒక ఉత్సవం కావాలి. ప్రారంభోత్సవం, ఆవిష్కరణ మహోత్స

వం కావాలి. ఆ ఉత్సవానికి అధిష్ఠాన దైవంగా ఒక అమాత్యులను పిలవ్వాలి. వారు ప్రసంగం ఇవ్వాలి. మీటనొక్కాలి. లేదా రిబ్బను కత్తిరించాలి. అప్పటికికాని ఆ భవనం బ్రతుకు మొదలవదు.

నిజానికి గుమాస్తాలూ, ఫైళ్ళూ, సిరాబుడ్లూ కిరణ్ భవన్‌లో కాపురం మొదలెట్టిన నెలరోజుల తర్వాత, సెక్ జాసెక్ లిద్దరూ కుస్తీలుపట్టి— పందిళ్ళు వేయించి, ఆర్కు దీపాలు వేయించి, పూల మొక్కలు అద్దెకు తెప్పించి, తివాసీలు పరచి, సోఫాలు వేయించి, పత్రికలవారిని పిలిపించి, ఫోటోలు ఏర్పాటు చేయించి, అల్పాహారవిందు కావించి —నిష్ఠా వియమమూ తప్పకుండా ఉత్సవం కావించారు.

ఉత్సవ విగ్రహం గారు— అదే మంత్రిగారు అనర్గళంగా, అజేయంగా అయోమయంగా—మాట్లాడేస్తున్నారు.

"ఈనాడే గనుక వాల్మీకి మహాముని బ్రతికివుంటే ప్రియతమమైన మన భరతవర్షపు ప్రగతిని చూచి ఎంత గొప్పకావ్యం రాసేవాడో....." అని ఆలోచిస్తూ ఒక నిముషం—

"నా చిన్నప్పుడు మా కోనోరిపాలెంలో ఏం జరిగిందంటే—" ఆత్మకథ చెబుతూ మరో నిముషం—

"మన సరిహద్దులలో పొంచి వున్నారు. వేచి వున్నారు. కాచుకొని వున్నారు. నక్కి వున్నారు.. వున్నారు. వున్నారు...... ఎవ్వరు?? మన శత్రువులు—" అని హెచ్చరిస్తూ మరో నిముషం....."

"కనుక, ఈ క్లిష్ట పరిస్థితులలో మీరు, మీ జీతం వంద రూపాయలయినాసరే, ఏదో కొంత పొదుపు చేయాలి. ఆ పొదుపే మన దేశానికి మదుపు" అని ఉద్బోధిస్తూ, అంతకుముందారగించిన జాంగిరీలను త్రేనుస్తూ మరు నిముషం—

ఈ విధంగా మంత్రిగారు మాట రెండవ నిముషం తమ ఉపన్యాసాన్ని పేల్చేస్తుండగా, అక్కడకు చేరివున్న రెండువందల చిల్లరమంది శ్రోతల నదనా కాశాలలో మాత్రమేగాక, దేవుడు మననెత్తిమీద పెట్టిన ఒరిజినల్ ఆకాశంమీద కూడా కారు మేఘాలావరించాయి.

సెక్ జాసెక్ వైపు చూశాడు.

జాసెక్ చూపులతోనే— "మన్నేముందండీ.... ప్రస్తుతం మంత్రి రూపంలో వున్న భగవంతుడి చేతి కీలుబొమ్మలం ...నిమిత్తమాత్రులం...." అని చెప్పాడు.

విలేకరులు వెళ్ళిపోయి వాళ్ళ పత్రికలకు రిపోర్టు విచ్చేయడం కూడా ఐపోయింది.

శ్రోతలూ "బయటకుదారి" వైపు జారుకోసాగారు.

వాన చినుకులూ పడసాగాయి.

వో ఇరవై నిముషాల తర్వాత, షామియానా తప్ప తడిసి, వో సందుగుండా వాననీరు కారి, మంత్రిగారి తెల్లటి షెర్వానీమీద చల్లగా నల్లగా పడింది.

ప్రసంగ ప్రవాహం ఓ క్షణం ఆగింది.

ప్రక్కకు తిరిగి అయన సెక్‌తో—"వర్షం పడుతూందేమిటి?" అన్నారు.

సెక్ హడావిడిగా లేచి, చేతులు కట్టుకుని, అతి వినయముగా "అవున్సార్.... వర్షమే సార్...పడుతూంది......" అని మనవి చేశాడు— అవాడు వర్షానికి ఏమీ భయభక్తులు లేకుండా వున్నందుకు తానేంతో చింతిస్తున్న ధోరణిలో.

దాంతో మంత్రిగారు "మన కావ్యాలలో వర్షం" అన్న విషయం మీద సోదాహరణంగా ప్రసంగం ఎత్తుకున్నారు. ఈ పాటికింకా వుండిన అరవై ఇద్దరు ఇద్దరు శ్రోతలలో నికరంగా ఆర్గురు మిగిలారు. ఆమహాసభలో..... ఆ ఆర్గురిలో ముగ్గురు సెక్కూ, జాసెక్కూ మరియు మంత్రిగారూ!

సరే ఎలాగయితేనేం, కిరణ్ భవనం, ఆ శనివారం సాయంకాలం ఏడున్నర గంటలప్పుడు జడివానలో మంత్రిగారి ఆశీస్సులతో ఆవిష్కరింపబడింది.

ఆరాత్రి సెక్— ఇంకా జాసెక్ గాడిని వదలించుకోవడం ఒక్కటే బాకీ— అన్న తలపుమినహాయిస్తే హాయిగా ఆదమరచి నిద్రపోయాడు. అవివాహితుడైన జాసెక్కూ జమ్మున నిద్రాదేవి బిగికౌగిలిలోకి వెళ్ళిపోయాడు......

కాని ఆ సాయంకాలం మంత్రిగారు ప్రసంగాన్ని కురుస్తుండగా మొదలయిన వర్షం మాత్రం—నిద్ర కాదుకదా కునుకయినా లేకుండా కురవసాగింది.

శనివారం రాత్రెల్లా కురిసి, ఆదివారం పగలెల్లా కురిసి, కురిసి, ఆదివారం రాత్రిలోకి కూడా తన తడి తడి అడుగులతో నడచి వెళ్ళడానికి సిద్ధమయింది వర్షం.

ఆ ఆదివారమంతా, సెక్,జాసెక్ ఆదిగాగల నాగరికులు ఎవరిళ్ళల్లో వాళ్ళుగా, ఏదో విధంగా పొడి పొడిగా కాలక్షేపం చేశారు.

ఆదివారం రాత్రి..... అర్ధరాత్రి గడిచాక..... సెక్ గారింట టెలిఫోన్.... మహాసభలో మంత్రిగారి వలె, అదేపనిగా అరవసాగింది.

సెక్‌గారి భార్య ఫోన్ అందుకుంది.

అవతల జాసెక్ ఉన్నాడు. 'నీ మొగుణ్ణి లేపవమ్మా తల్లీ" అని బ్రతిమాలుతున్నాడు.

ఏ అరవైమంది సభ్యులో ఉన్న పళంగా అవతలి పార్టీలోకి వెళ్ళి పోయారేమో, తత్ఫలితంగా ప్రభుత్వంకాస్తా పడి పోయిందేమో అనుకుంది 1967 లో ఈదేశంలో జీవించిన ఆ ఇల్లాలు.

వెంటనే నాథుడిని లేపింది.

మొదట నిద్రమత్తుతో 'లో... లో....' అంటున్న సెక్రటరీ మరునిముషం కళ్ళు తెరచి, నోరింకా తెరచి— "హెవిటి!?!" అన్నారు.

ఆయన గొంతులోని ఆందోళనను విన్న ఇల్లాలు —ఇదేదో కేవలం పార్టీల ఫిరాయింపు కాదు ..... సైనికుల తిరుగుబాటే— అనుకుంది. గజగజ వణికి పోయింది.

"అయ్యా! మన కిరణ్ భవనంలోని బేస్‌మెంట్, గర్భగృహం వుంది చూశారూ! అదిపూర్తిగా నీళ్ళతో నిండిపోయిందట. ఫైళ్ళూ, కుర్చీలూ తేలుతున్నాయట......" అన్నది జాసెక్ చెప్పిన దాని సారాంశం. సెక్‌కు బుర్ర బద్దలయినంత పనయింది.

"ఒకవేపు కొంపంటుకు పోతుంటే.... ఐయామ్ సారీ ..... కొంప మునిగి పోతుంటే..... తాపీగా ఫోన్ దగ్గర కూచుని మాట్లాడుతావేమిటయ్యా.... తక్షణమే అచ్చోటికి లంఘించి, క్షటిచేసి, రిపోర్టు తయారు చెయ్యక....." అని కోప్పడిన సెక్రటరీ ఐ. సి. ఎస్.గారు—"ధూర్తేరి... ఈ ఐ. ఏ. ఎస్. గాళ్ళెప్పుడూ ఇంతే" అని విసుక్కున్నాడు.

జాసెక్ ఇంకా పూర్తిగా ప్రభుత్వోద్యోగి అయిపోలేదు. కనుక కొంత మామూలు జ్ఞానం అతడిలో మిగిలివుంది. అందుకనే—"రిపోర్టు సరే తయారు చేస్తానుకోండి.. ఇపుడా నీళ్ళను అక్కడనుండి తీయాలి — అది మన మొదటి కర్తవ్యమనుకుంటానండి" అన్నాడు.

"వాటెవరిటీస్.. నువ్వు తక్షణం కారు తీసుకుని ఇక్కడికి రావోయ్. నేనీలోగా చీఫ్ ఇంజనీర్‌ని పిలుస్తాను. ముగ్గురం కలిసి వెళ్దాము" అని సెక్ ఫోన్ పెట్టేసి, వో కప్పు టీనీరు సేవించి, బట్టలు మార్చుకుని, టై, గ్రటా బిగించి సిద్ధమయ్యే సరికి చీఫ్ ఇంజనీరూ జాసెక్కూ వచ్చారు.

ముగ్గురు కలిసి కారులో బయలుదేరారు.

కిరణ్ భవనానికి నలభై గజాల దూరాన కారాపారు.

ఇరవై అడుగుల దూరాన రెండడుగుల లోతు నీటిలో రోడ్డుమీద నిలబడి చూశారు.

కిరణ్ భవన్—సముద్రం మధ్య వోడలా వుంది.

పరీక్షిత్తు మహారాజు కట్టించుకున్న ఒంటి స్తంభం మేడలా వుంది.

వానవేసపుడు ఆడుకుంటున్న కాగితం పడవలా వుంది.

జాగ్రఫీలో చెప్పే 'ద్వీపము'న కో చక్కని ఉదాహరణలా వుంది.

సెక్ స్కైకి చూశాడు. వర్షం ఆగినట్లనిపించింది. నక్షత్రాలు బయట పడడానికి సిగ్గుపడుతున్నట్లున్నాయి.

"ఎంత, రెండడుగుల నీరుందేమో".. అన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు సెక్.

"కాదండి ... ఈ రోడ్డు మీదే రెండడుగులుంది కనుక అక్కడ కనీసం పదహారడుగులయినా వుండాలి" అన్నాడు జాసెక్.

"ఎందుకని?" అని అడిగాడు సెక్.

"బేస్‌మెంట్ వుందికదండీ.. అందుమూలాన్ని"

అవును బేస్‌మెంటుంది. ఆ ఏడంతస్తుల కిరణ భవన్‌లో క్రింది అంతస్తుకు క్రిందుగా నేల మట్టానికి దిగువగా ఒక భూగర్భగృహం లాంటిది ఉంది. రికార్డులకని, స్టోర్‌కని, ఫర్నీచర్‌కని, అది వుంది.

ఇంజనీర్ మొదట వేసిన ప్లాన్‌లో అది లేదు. కాని మరో లక్ష రూపాయలతో బోలెడంత చోటు కలిసి వస్తుంది. అన్న మంత్రిగారి సలహా మేరకు ఆభూగర్భ గృహం నిర్మించబడింది. దానిలోకి మొన్న శనివారంనుండి తిన్నగా వాననీళ్ళు మాత్రమే కాక రోడ్డు మీదినీళ్ళుకూడా ప్రవహించ సాగాయి. వారి నీరు పల్లమెరుగును కదా! భౌతిక శాస్త్రంలోని సూత్రం మేరకు రోడ్డు మీది నీటి మట్టమూ కిరణ్ భవన్ ఆవరణలోని నీటి మట్టమూ ఒక్కటయ్యేదాక నీరు ప్రవహించి, ప్రవహించి ఆ

# నీరు పల్ల మెరుగు

భూగర్భ గృహాన్ని అదృశ్యం కావించింది.అక్కడి ఫైళ్ళని వాన్చివేసి తేల్చి నేసింది.

ఇంతసేపూ వూరుకున్న చీఫ్ ఇంజనీర్—

"మీారెన్ని అన్నా అనండి సెక్రటరీగారూ! ఇన్ని అడుగుల నీటిలో ముప్పై ఆరుగంటలు నానుతూ కూడా పడిపోకుండా నిల్చింది. ఈ భవనం అంటే మన ఇంజనీర్ల ప్రతిభ ఎటువంటిదో ఆలోచించండి!" అని గర్వంగా పలికాడు.

సెక్ ఆయన్ని ఉరిమి చూశాడు.

"మొట్టమొదట నీళ్ళ— ఇదిగో ఈ నీళ్ళు ఇట్లా లోపలికి వచ్చేయ డానికి కారణం ఏమిటో సెలవియ్యండి—" నిలవ్వేశాడు చీఫ్‌ని.

"దానికి పెద్ద ప్రశ్నకూడా ఎందుకండీ...... వాన...మళ్ళై...రెయ్న్... ప్రిషి్ప్. బారిష్...అదీ కారణం."

"అదికాదయ్యా స్వామి! మళ్ళై కురిస్తే కురవనీ గాక ఉళ్ళోవాళ్ళంతా కలిసి ఈ భవనంలోకి రావడం ఏమిటీ అంటా? ఇదేం ఆఫీసా లేపోతే రిజర్వాయరా? అని దబాయించి మరీ అడిగాడు సెక్.

భుజా లెగరవేశాడు చీఫ్ ఇంజనీరు. ఆపైన చెప్పసాగాడు — "మహానుభావా! ఆ విషయం నన్నడక్కండి. ఈభవనం తాలూకు పునాదినే నేలమట్టంనుండి ఆరడుగుల ఎత్తుకు లేపాలి అని నేను సూచించాను ప్లానులో. అందుకు విరుద్ధంగా పధ్నాలుగు అడుగుల లోతున ఈ భూగర్భంకావాలని మంత్రిగారన్నారు. వీలులేదయ్యా "ముడియాదు" 'ఇంపాజిబుల్' అని గట్టిగా చెప్పాను. ఫైలు మీాద రాసిచ్చాను కూడా. అయినా వినిపించుకోక ఈ పాతాళ గృహం కట్టుకున్నారు. కనుక ఇది రిజర్వాయరా, బే ఆఫ్ బెంగాలా అని మీా రడగవలసింది నన్ను కాదు, గౌరవనీయులైన మంత్రిగారిని..." అన్నాడు.

"ఇంకో రెండు రోజుల్లో రిటైరు కాబోతున్నాడు.....వీడికేం ఎన్నన్నా చెబుతాడు. భయం భీతీ లేకుండా" అనుకున్నాడు సెక్

చివరకు అందరూ కలిసి మంత్రిగారిని సమీాపించారు.

తెల్లవారింది.

శ్రీవారు ఖుద్దున వచ్చి పరీక్షించారు.

నీటిమధ్య నిలబడివున్న కిరణ్ భవనాన్ని చూసి ఆయన కళాహృదయ ముప్పొంగి పోయింది.

"ఎంత అద్భుత దృశ్యం!" అన్నారాయన.

సెక్‌కి అంత తడిలోనూ ఒళ్ళు రవరవ మండింది. అయినా ఏం చెప్పగలడు, అవతల పలికింది మంత్రిగారాయె.

కనుక చేతనయినంత భయ భక్తులతో— "చాల నీళ్ళె వెళ్ళిపోయాయండీ భవనంలోకి. ఇప్పుడు వాటిని బయటకు తీయించాలి"అని మనవి చేశాడు.

నెత్తి మీాద సుత్తితో కొట్టినట్లు నేలు కున్నారు మంత్రి.. "ఆ..అరెరె... అవునయ్యోాస్ అయినా, ఇదేం దారుణం ఆఫీసు బిల్డింగులోకి ఇలా నీళ్ళు వచ్చేయడం ఏమిటీ — త్వరగా తీయించేయి వాటిని .... కావలసినన్ని బాల్చీలూ అవీ తెప్పించండి." అని అమూల్యమైన సలహాని పారేశారు. దాని నెవరూ ఏరుకోలేదు.

"కాని సార్, నీళ్లను బాల్చీలతో తోడిన తర్వాత ఎక్కడపోయాలిసార్? అన్ని ప్రక్కలా నీళ్ళున్నాయికదా కనుక ఎక్కడ పోసినా అవి పల్లాన్ని వెతుక్కుంటూ ఆ గర్భగృహంలోకే వస్తాయి" అని వివరించాడు చీఫ్ ఇంజనీర్. తమ అపూర్వ ప్ర తి భ ఎదుర్కోలేని జ టి ల సమస్యను ప్రతిపాదించిన ఆ అనాగరికపు మనిషి మీాద మంత్రిగారికి బలే చెడ్డచిరాకు కలిగింది. విన వినా నడవసాగారు. అగఘర్లాంగు కవతల నీళ్ళు ఎక్కువ లేనిచోట నిలుచునివున్న తమ కార్లోకి ఎక్కి కూచుని—సెక్‌ని చూచి,

"ఈ సమస్యా పరిష్కారానికి త్రిసభ్య సంఘాన్ని వేస్తున్నాను. దానికి అధ్యక్షులుమీారు. మిగతా ఇద్దరు సభ్యుల్ని మీారే వేసుకోండి. నాకు మాత్రం పదింటిలోపుగా ఒక చిన్న నోట్ పంపితే సభ్యుల ఎదుట వుంచుతాను." అని వెళ్ళిపోయారు.

...ఫైలు లేని ప్రభుత్వోద్యోగి—రెక్కలు లేని పక్షి—వొత్తి లేని దీపం—ప్రాణంలేని దేహం.

కనుక—

"అమూసేసిన ఫైలులో ఇరవై యెడో వాల్యూము తెరవాలి..." అన్నాడు—మంత్రిగారు చెప్పిన మేరకు చర్యలు తీసుకోదలచిన సెక్.

"ఆ ఫైలుయొక్క ఇరవైయ్యారు వాల్యూములూ ఆ బేస్‌మెంటులో వున్నాయి కదండీ" అన్నాడు జూసెక్.

ఏదో ఫెళ ఫెళ మన్నట్లు విన్పించింది.

"అయ్యబాబోయ్ ఫైలే లేకపోతే నేనేమి చేతురా దేవుడా" అని శోకించసాగిన సెక్‌కు చీఫ్ ఇంజనీరు ఎందుకు పరుగెత్తుతున్నాడో అర్థంకాలేదు.

**ఈ జోకే నంతా చూసి కిరణ్ భవన్ పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వ సాగింది.**